


# ఆస్తి

-గరిగిపాటి అరుణకుమార్

స్థలం: త్రీస్టార్ హోటల్, బంజారా. సమయం, ఉదయం తొమ్మిది గంటలు. మూడు సంవత్సరాల నుండి ప్రతి ఆది వారం ఈ టైమ్‌లో ఇక్కడ వీళ్ళి ద్దరూ కలుసుకుంటున్నారు.

"వచ్చినప్పటి నుంచి చూస్తున్నాను, నేనే మాట్లాడుతున్నాను తప్ప నువు మాట్లాడవేం? రాన్రాను నువు మరీ ఇలా తయారవుతున్నా వేమిటి. కారణం ఏమిటసలు?" రేఖ అడిగింది.

"అలాంటి దేం లేదు. చెప్పు. ఆపకుండా, ఎంత సేపు మాట్లాడమంటావ్?" అన్నాడు ఆనంద్.

"హాస్యాలొద్దు, ఇంక లాభం లేదు. చెప్పు ఇంకా ఎంతకాలం వుంది నీ చదువు?"

"ఎనిమిది నెలలు కాలేజ్ ప్లస్ ఒక సంవత్సరం హౌస్ సర్జన్ మొత్తం ఇరవయి నెలలు."

"మరి ఎమ్మెస్?"

"తర్వాత ఆలోచిద్దాం. అన్నట్టు మా నాన్న గారికి ట్రాన్స్ఫర్ అవ్వచ్చు ఈ జూన్‌లో."

"మరి నువ్వెక్కడ వుంటావ్, హాస్టల్‌లోకి మార తావా?"

"లేదు మీ ఇంట్లోకి"

"నిజమే?" నవ్వుతూ అడిగింది.

"కాదులే గానీ, మా ఇంట్లోనే మేడమీద వుంటాను. కింద అద్దెకిచ్చేస్తారట."

"మరి భోజనం?" అడిగింది.

"ఇంకా ఆలోచించలేదా విషయం గురించి."

ఇంతలో స్టీవార్డ్ వచ్చాడు మెనూతో.

ఆనంద్ వాళ్ళింటి పక్కన. మూడు సంవ త్సరాల క్రితం వరకు రేఖావాళ్ళూ అద్దెకుండే వారు. తర్వాత వాళ్ళు సొంత ఇల్లు కట్టించి అందులోకి మారిపోయారు.

* * *

గురువారం మధ్యాహ్నం లంచ్ అవర్‌లో మెడికల్ కాలేజ్ క్యాంటీన్ కోలాహలంగా వుంది. ఆ టేబుల్ చుట్టూ ఆనంద్, ఆనంద్ క్లాస్‌మేట్ మధు, వీళ్ళు కాక మరి ముగ్గురూ కూర్చుని వున్నారు. ఆ మిగతా ముగ్గురూమధుకి ఫ్రెండ్స్. వాళ్ళు ఆనంద్ మధూలకు ఒక సంవత్సరం సీనియర్లు ప్రస్తుతం వాళ్ళు హౌస్ సర్జన్లు. ఆ ముగ్గుర్లో చెప్పుకో తగ్గ వ్యక్తి కిరణ్. క్రిందటి సంవ త్సరం అతడు ఆ కాలేజ్ ప్రెసిడెంట్ కూడా. ఏ విషయంపైనైనా అనర్గళంగా మాట్లాడగలడని ఆ కాలేజ్‌లో అతనికి పేరుంది.

మాటల మధ్యలో రాగింగ్ గురించి టాపిక్ వచ్చింది. కిరణ్ కాలేజ్‌లో జాయిన్ అయిన సంవ త్సరంలో తన రాగింగ్ అనుభవాలు చెప్తూ,

"సుధామయీ, అగ్నిహోత్రి అని అప్పుడు ఫోర్తియర్ చదువుతూ వుండేవాళ్ళు. వాళ్ళకి రౌడీ రంగమ్మ, రాణీరుద్రమ్మ అని జాయింట్‌గా పేర్లుండేవి. వాళ్ళే నన్ను రాగ్ చేసిన మొదటి చివ రి ఆడవాళ్ళు. ఇప్పటికీ వాళ్ళ పేర్లు మన కాలేజి లో వినిపిస్తుంటాయి."

అప్పటికే మిగతా ఇద్దరు హౌస్ సర్జన్‌లకి మొహాల మీద చిరునవ్వు వచ్చేసింది. ఉత్సాహంగా ముందుకు వంగిన మధు.

"చెప్పండి, ఏం చేసేరో ఎలా చేసేరో?"

"మొదట చాలా సేపు తిక్క ప్రశ్నలేసారు, నువు ఇండియా ప్రైమ్మినిష్టరయితే ఏం చేస్తావ్, మీ తాతయ్యకి మీ నానమ్మ మీద ప్రేముందా, మీ తాతయ్యకి ఎంత మంది భార్యలూ లాంటివి. చివర్న అడిగారు, 'జెండర్' అంటే తెలుసా అని. తెలుసు అన్నాను. ఎన్ని రకాలు అని అడిగారు. నాల్గు రకాలని చెప్పాను. కామన్ జెండర్‌కి ఉదాహరణ చెప్పమన్నారు. ఫ్రెండ్, ఎనిమీ అని చెప్పాను. మాస్క్యులైన్ జెండర్‌కీ ఫిమినైన్ జెండర్‌కీ తేడా ఏమిటి? ఉదాహరణలతో చెప్పమన్నారు. ఉదాహరణలుగా మేన్ మరియు వుమెన్‌ను తీసుకోవచ్చని చెప్పి కొంచెం సేపు తటపటాయించాను. తేడాలు చెప్ప అన్నారు. ఫిజికల్ స్ట్రక్చర్‌లో తేడాలుంటాయి అన్నాను. కొంచెం ముందు కెళ్ళమన్నారు. ముందుకెళ్తే ఇబ్బంది అన్నాను. ఎవరికీ అన్నారు. నేను సైకాలజీలోనూ స్ట్రక్చర్‌లోనూ మరికొన్ని తేడాలు చెప్పాను. ఇంకా ముందు కెళ్ళమన్నారు. ఒక్కసారి బరస్టయ్యాను, ఇంకా ముందు కెళ్తే కడుపు లవుతాయని. అంతే ఇద్దరూ ఫెయింట్ అయ్యారు" మధు గట్టిగా నవ్వాడు.

"ఏం మీకు నవ్వ లేదా" ఆనంద్‌కేసి చూసి అడిగేడు కిరణ్. చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు ఆనంద్.

"మీ ఫ్రెండ్ మంచి బిడియస్తుడనుకుంటానే. అసలు ఇక్కడి కొచ్చింది మొదలు అసలతను మాట్లాడిందే లేదు." మధుతో అన్నాడు.

"అత్యవసరమనుకుంటే మాట్లాడతాడు. అదతని స్వభావం" మధు చెప్పాడు.

"తక్కువ మాట్లాడే వాళ్ళంటే నాకిష్టం. నేనేప్పటికీ అలా వుండలేనేమో" సర్దేశాడు కిరణ్. తర్వాత టాపిక్ లంచగొండితనం మీదకు వెళ్ళింది.

"దేశం కాంట్రాక్టర్లకీ ఇంజనీర్లకీ, పొలిటీషియన్లకీ బలై పోతోంది. కనీసం పొలిటికల్ లీడర్స్‌కి కొంచెం జనం భయమైనా వుంటుంది. మిగతా వారికి ఆ భయమూలేదు. కనస్ట్రక్షన్ ఇంకా పూర్తిగా అవకముందే బిల్డింగ్ కూలిపోయినా అడిగే నాథుడు లేదు. మహా అయితే ట్రాన్సర్ చేయడమో కాంట్రాక్ట్ రద్దు చేయడమో చేస్తారు. అక్రమంగా సంపాదించని ఇంజనీర్లుగాని, కాంట్రాక్టర్‌లు గాని,మరెవరయినాగాని వందకో అయిదు మందుంటారా సంపాదించే అవకాశం వున్న వాళ్ళల్లో?"

"అందరూ కావాలని అలా అవ్వరు కదా? కొందరు వాళ్ళని అలా తయారు చేస్తారు. వత్తిడి తెచ్చో, మరో కారణం చేతో" ఓ పాస్ పర్జన్ అన్నాడు.

"అదే నాన్‌సెన్స్. నేను లంచం తీసుకోను అంటే కాల్చి చంపుతారా? ఉద్యోగం తీసేస్తారా? ఒక వేళ, వేరెవరి బలవంతం మీదో లంచం తీసుకుంటున్నామూ అని అనుకుంటే అది ఇచ్చితంగా ఆత్మవంచనే అవుతుంది. తప్పు ఎలా జరిగినా తప్పు తప్పే.మా వీధిలో పి.డబ్ల్యు.డిలో పని చేసే ఒకాయన వున్నాడు. కారు, ఇల్లు, ఇద్దరు కొడుకులకీ స్కూటర్లు, ఒకటనేమిటి సంపాదించనిది అంటూ ఏదీ లేదు. ఆయన ఉద్యోగంలో జాయిన్ అయిన కొత్తల్లో ఆఫీస్‌కి సైకిల్ మీద వెళ్ళే వాడట. ఇవన్నీ న్యాయమార్గంలో సంపాదించినవే అని అనుకోవాలా? అసలు మీ యెరికలో అక్రమంగా సంపాదించని ఇంజనీరు గాని, మరెవరైనా గాని, సంపాదించే అవకాశం వున్న వాళ్ళల్లో వున్నారా?

మచ్చుకి ఒక్కరైనా?"

"ఉన్నారు." మధు అన్నాడు.

"ఎవరు?"

"ఆనంద్ వాళ్ళ నాన్నగారు"

"ఈజిట్ ఆనంద్! మీ నాన్న గారేం జేస్తారు?"

"ఆర్ అండ్ బి లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు"

"పేరు?"

"బలరావ్ుగారు"

"ఎస్.బలరావ్ు?"

"అవును. మీకు తెలుసా మా నాన్నగారు?"

"మా పెద్ద బావగారు అదే ఆఫీస్‌లో జూనియర్ ఇంజనీరు" ఈ మాటని, చటుక్కున మాట్లాడటం ఆపేసాడు కిరణ్. కొంచెం సేపటికి సర్దుకున్నాడు. ఆ తర్వాత పావుగంటకు మధూ, ఆనంద్‌లు క్లాస్‌కెళ్ళిపోయారు. ఆనంద్ అదోలా అయిపోయాడు. పిచ్చి పిచ్చి ఆలోచనలు మనసులో ముసురుతుండగా ఎప్పుడూ లేనిది, అవర్ ఎగ్గొట్టి ఇంటికెళ్ళిపోయాడు.

ఈ విషయంపై ఎక్కువగా ఆలోచించి పూర్తిగా అప్‌సెట్ అయి రాత్రికి జ్వరం తెచ్చుకున్నాడు. భోజనం చేయకుండా పడుకున్నాడు. బలరావ్ుగారు కొంచెం ఆలస్యంగా వచ్చారా రోజు. పార్టీ లేటయిందని వాళ్ళ అమ్మగారికి చెప్తుంటే అప్పుడే నిద్రపడుతోంది ఆనంద్‌కి.

ఆనంద్ ప్రొద్దున్న లేచేటప్పటికి ఇంకో డిగ్రీ టెంపరేచర్ పెరిగింది. అప్పటికే లేచిన బలరావ్ుగారు హాల్లో కాఫీ తాగుతూ పేపర్ చూస్తున్నారు. బ్రష్ చేసుకు వచ్చిన ఆనంద్ ఆయన ఎదురుగా సోఫాలో కూర్చున్నాడు. తను మాట్లాడాలనుకున్న విషయాన్ని ఎలా మొదలుపెట్టాలా

యర్రంశెట్టి శాయి
ఓ కొత్త సీరియల్
మరణానికి చిరునామా
త్వరలో!

అని ఆలోచిస్తున్న సమయంలో,

"ఎంతుంది టెంపరేచరిప్పుడు?" అడిగే రాయన.

"వంద డిగ్రీలు" అని కొంచెంసేపు తటపటాయించి

"నాన్నా" పిలిచాడు.

ఆయన పేపరు క్రిందకు వాల్చి ఏమిటన్నట్లు చూసారు.

"తాతయ్య మీకు ఆస్తి ఎంతిచ్చారూ?" అసందర్భమైన ఈ ప్రశ్నకు ఆయన కొంచెం ఆశ్చర్యంతో,

"ఏం? ఏమీ ఇవ్వలేదు"

"మరి ఈ ఇల్లూ, మన కారూ, హైదరాబాద్‌లో ఇల్లూ ఎలా వచ్చాయి?" మొహంలోకి చూడకుండా అడిగేడు.

"సంపాదిస్తే." ఆయన కొంచెం చిరాకుగా అన్నారు.

"ఎలా సంపాదిస్తే?"

"తిక్క ప్రశ్నలెయ్యకు, ఏమయింది నీకివాళ?"

"జ్వరం వచ్చింది. ఎలా సంపాదించేరివన్నీ?" స్థిరంగా అడిగేడు.

"నోర్ముయి. నన్ను రెచ్చగొట్టకు, గెటవుట్"

"ఎలా సంపాదించారో చెప్పుకోలేని సంపాదన కదూ ఇది. నాకు తెలిసింది. అంతా తెలిసింది. ఈ సంపాదనతోనే అన్నం తిన్నాను, స్కూటరు, చదువు, పెట్రోలు, అన్నీ లంచం వల్లే వచ్చాయని నాకు తెలిసింది. ఇది తెలిసే తట్టుకోలేకపోతున్నాను."

"ఏం తెలిసిందిరా నీకు వెధవా?" ఆయన అరచిన అరుపుకి వంటింట్లో వున్న సావిత్రిగారు, బాత్‌రూమ్‌లో బ్రష్ చేస్తున్న సుమ హాల్లోకి చాలా వేగంగా వచ్చారు.

"ఏం తెలిసిందిరా నీకు. వెధవ్వాగుడు కట్టిపెట్టి ముందు లోపలికి నడు, నా ముందు నుండి వెళ్ళిపో" మళ్ళీ అన్నారాయన.

"ఇవాళ అటో ఇటో తేలిపోవాల్సిందే?"

సావిత్రిగారు, సుమ అయోమయంగా, బొమ్మల్లా నిలబడి చూస్తున్నారు.

"ఏం తేలిపోవాలిరా, ఫో, ఇక్కడి నుండి కదులు ముందు."

సోఫాలోంచి లేచి ముందుకు రాబోయేరు. సావిత్రిగారు బలరామ్‌గారి వద్దకు చేరుకుని ఆయన భుజం పట్టుకున్నారు. సుమ ఆశ్చర్యంతో చూస్తోంది.

"మీ ముందు నుండే కాదు. మీ ఇంటి నించే శాశ్వతంగా వెళ్ళిపోతున్నాను, మూడ్రోజుల్లో. ఈ మూడ్రోజుల్లో మన రెండు ఇళ్ళూ, కారు, నా స్కూటర్, డబ్బు ఇవన్నీ బయటకు వెళ్ళిపోవాలి. మనవి కాకుండా అయిపోవాలి. అలా అయితేనే నేనింట్లో వుండేది. లేదంటే వెళ్ళిపోతున్నాను."

ఆయన చేయెత్తి ఏదో అనబోతుంటే-

"ఆగండి నన్ను మాట్లాడనివ్వండి. మీరు

మీరు సంపాదించిన ఈ పాపపు ఆస్తిని వదులుకోని పక్షంలో, ఆ ఆస్తే మనం అందరం శిక్ష అనుభవించడానికి కారణమవుతుంది. నేను అమ్మకూ, సుమకూ దూరమై అనాథనైపోతాను. మీకూ, అమ్మకూ వుండీ లేని కొడుకునౌతాను. ఆలోచించుకోండి. మీరు కష్టపడి సంపాదించింది వదులుకోమనడం లేదు. పాపాన్ని వదిలేయమంటున్నాను. బాగా ఆలోచించుకోండి. ఏం చేస్తారో, ఏం నిర్ణయిస్తారో మీ ఇష్టం.

సంపాదించిన ఈ పాపపు ఆస్తిని వదులుకోని పక్షంలో, ఆ ఆస్తే మనం అందరం శిక్ష అనుభవించడానికి కారణమౌతుంది. నేను అమ్మకూ, సుమకూ దూరమై అనాథనైపోతాను. మీకూ, అమ్మకూ వుండీలేని కొడుకునౌతాను. అందుకే చెప్తున్నాను. ఆలోచించుకోండి. మీరు కష్టపడి సంపాదించింది వదులుకోమనటం లేదు. పాపాన్ని వదిలేయమంటున్నాను. బాగా ఆలోచించుకోండి. ఈ మూడ్రోజులూ ఏం చేస్తారో, ఏం నిర్ణయిస్తారో మీ ఇష్టం."

నిశ్చేష్టులయ్యారు సుమ, సావిత్రిగారు.

"ఏంట్రా ఆలోచించుకునేది, ఆలోచించుకుని చేసేది! ఇప్పుడే చెప్తున్నాను. అవుట్, గెటవుట్ ఆఫ్ మై హౌస్, నాకు కొడుకే లేడనుకుంటాను." గట్టిగా అరిచారు.

"ఏమండీ" సావిత్రిగారు చిన్నగా అరిచేరు.

"చూసావా సావిత్రీ. నాకే నీతులు చెప్పేటంత పెద్దవాడయిపోయాడు. సంస్కర్తననుకుంటున్నాడు. ఎవరి కోసం సంపాదిస్తున్నాననే ఇంగితం కూడా లేకుండా..." ఆయన సోఫాలో కూలబడ్డారు.

ఆనంద్ పుస్తకాలు న్యూస్ పేపర్లో వేసి కడుతుంటే, ఆ గదిలోకి సుమ వచ్చింది. ఆమె యేడుస్తోంది.

"ఏంట్రా అన్నా ఇది. ఏమైందిరా నీకు?" అని అడుగుతుంటే

"నువ్వీ విషయంలో తల దూర్చకమ్మా సుమా! అన్నట్లు నువ్వు నాకో మాటియ్యాలి. రెండు రోజులకి ఒకసారైనా నువ్వు నన్ను కలవాలి. కలిసి మాట్లాడాలి ఎక్కడైనా. సరేనా?" ఆమె ఏడుస్తూనే వుంది.

"ఎల్లుండి సాయంత్రం మీ కాలేజ్‌కి వస్తాను. సరేనా?" అన్నాడు. ఇంతలో వాళ్ళమ్మగారు వస్తూ, "నువ్వెళ్ళిపోతే నేనింకా బ్రతికే వుంటాననుకుంటున్నావురా?" ఆమె కళ్ళు ధారలు కట్టి వున్నాయి.

"అమ్మా, ఈ విషయం గురించి నన్ను వేధించకమ్మా. నీ కెప్పుడు చూడాలని వున్నా చెల్లితో కబురుపెట్టు. కనీసం వారానికొకసారైనా వస్తాను."

పావుగంటకు హాస్టల్ దగ్గరున్నాడు. మధు అతన్ని రూమ్‌లోకి మనస్ఫూర్తిగా ఆహ్వానించాడు.

** ** **

ఆదివారం ఉదయం తొమ్మిది గంటల ముప్పై నిమిషాలు. అప్పటికి వాళ్ళు హోటల్‌లో కూర్చుని అరగంట దాటింది.

"ఏదో అయింది కదూ?" అడిగింది రేఖ.

"ఏమీ కాలేదు" ఆనంద్ అన్నాడు.

"లేదు. ఏదో అయింది."

"సరే అయింది. అదేమిటో చెప్పే ముందు నిన్ను కొన్ని ప్రశ్నలడుగుతాను. ఎందుకు, ఏమిటి, అని అడక్కుండా సూటిగా సమాధానం చెప్తావా?"

ఆమె ఏమీ మాట్లాడలేదు.

"నేనంటే నీకిష్టమేనా?"

ఆమె తలూపింది అవునన్నట్లుగా.

"తలూపితే నాకర్థం కాదు, నోటితో చెప్పు"

"ఇష్టమే"

"ఎంతిష్టం"

"నేనంటే నీకెంతో, అంత నిజంగా"

"నన్ను ప్రేమిస్తున్నావా అయితే"

"అంతే కదా మరి"

"పెళ్ళి చేసుకుంటావా?"

పటిష్ఠమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్

"ఎవర్నీ? షరిగ్గా అడుగు."

"నన్ను"

"చేసుకుంటాను"

"ఎటువంటి పరిస్థితుల్లోనైనా చేసుకుంటావా?"

ఆమె మాట్లాడలేదు.

ఆమె మొహంలోకి చూసాడతడు. ఆమె తల పక్కకు తిప్పి చెంచా చేతిలోనికి తీసుకుని చిన్నగా శబ్దం చేసి, ఒక నిమిషం ఆగి అంది.

"ఈ ప్రశ్నకు సమాధానం ఇక్కడ చెప్పలేను. నేనోచోటికి రమ్మంటాను. అక్కడికొస్తే చెప్తాను"

"పద వెళ్దాం" లేవబోయాడు.

అతన్ని కూర్చోబెట్టి అతని జేబులో పెన్ను తీసి, టేబుల్ పై వున్న పేపరొకటి తీసి పేపర్ మీద ఏదో వ్రాసి, పెన్ను, కాగితం అతని జేబులో పెట్టింది.

" ఊ... ఇప్పుడు చెప్పు అసలు విషయం. లేక ఇంకా ప్రశ్నలేమైనా వున్నాయా? ఆహా... తీయకది జేబులోంచి. తర్వాత చదువుకో"

క్యాంటీన్‌లో జరిగిన విషయం, ఇంట్లో గొడవా, తను మధు రూమ్‌లోకి మారిన విషయం చెప్పాడు. ఆమె మొహం అదో రకంగా అయిపోయింది.

"మరి డబ్బులు?" అడిగింది.

"ప్రస్తుతానికి మధు దగ్గర ఒక అయిదు వందలు వున్నాయి. ఇంటికి కావాలని రాస్తానన్నాడు. ఏదైనా చేయాలి, పార్ట్ టైమ్ జాబ్‌లాటిది"

ఆమె ఎడం కంటి నుండి నీటి చుక్క జారుతుండగా కనపడకుండా కర్చీఫ్‌తో నొక్కిపట్టి అంది.

"జాబా?"

"అవును. ఏం?" ఆమె మెడలో గొలుసు తీస్తోంది.

"ఆవేశపడకు. ఎందుకు గొలుసు తీస్తున్నావు?"

"చూడూ, నీకీ గొలుసు అప్పుగా ఇస్తున్నాను. అమ్మగా ఎంత వచ్చిందో రేపు నాకు నువ్వు చెప్పాలి. నీ కెంత డబ్బు ఖర్చు అవుతుందో స్టేటిస్టిక్స్ అన్నీ వేసి, ఇంకా అవసరమైతే అమ్మనడిగి ఇస్తాను, తీసు కుంటాను అని మాటీ"

"రేఖా, అదీ..."

"ముందు మాటీ"

అతనేం మాట్లాడలేదు.

"మాటివ్వు ప్లీస్. నువ్వు మాటివ్వకపోతే, నేనిక్కడ గట్టిగా ఏడ్చేస్తానేమో ప్లీస్ మాటివ్వు. నువ్వు చదువుకునేటప్పుడు ఉద్యోగం చెయ్యడం నా కిష్టం లేదు. అయినా అప్పే కదా"

"సరే" ఆమె చేతిలో చెయ్యి వేసి నొక్కాడు. ఆమె అతని చేతిని అలాగే గట్టిగా పట్టుకుంది.

*　　*　　*

రాత్రి పదకొండయింది. టేబుల్ లైట్ కాంతిలో ఆమె వ్రాసిన వాక్యాలు మళ్లీ చదువుతున్నాడు ఆనంద్.

*ప్రేమకూ, నిజమైన ప్రేమకూ తేడా చెప్పగలవా నువ్వు. నేనైతే చెప్పలేను. ఎందుకంటే నేనెప్పుడూ వీటి బేధం గురించి ఆలోచించలేదు. నా ప్రేమ గొప్పదని నేను చెప్పటం లేదు. నటన మాత్రం కాదని చెప్తున్నాను. ఎలాంటి పరిస్థితులలోనైనా పెళ్ళి చేసుకుంటావా' అని నువ్వు నీ కంట్రోల్‌లో లేని పరిస్థితులలో వుండి అడిగేవు అనుకుంటున్నాను. పరిస్థితులకు భయపడి పారిపోయే పిరికి వాళ్ళని నువ్వు పెళ్ళి చేసుకోవడానికి నిర్ణయించుకుంటావు అని అనుకుని నిన్ను నేను తక్కువ అంచనా వేయను. చూస్తాను - నువ్వు ఎంత క్లిష్ట పరిస్థితుల గురించి చెప్తావో, దానికి నా రియాక్షన్ ఎలా వుంటుందో! చూడు ఆనంద్ -*

*నీ గురించిన ఊహ మాత్రమే నాకు ఉత్తేజాన్నిస్తుంది. ఇంక నీతో కలిసి బ్రతికే బ్రతుకు మధురిమను నేను మాటల్లో చెప్పగలనా?*

*నీ*

*నేను*

బయట కాస్తున్న వెన్నెల కిటికీ లోంచి ఆనంద్ మీద పడి, అది గుండెల్లోకి పాకింది.

తలుపు కొడుతున్న చప్పుడు విని, ఉలిక్కిపడి లేచి తలుపు తీసాడు. బయట వాచ్‌మెన్ వున్నాడు.

"సార్. మీ కోసం ఎవరో వచ్చారు సార్ ఆడవాళ్ళు"

ఇంతలో మధూ లేచాడు. ముగ్గురూ కలసి హాస్టల్ గేటు దగ్గరకు వచ్చారు. సుమ, పక్కింటి అమ్మాయి వున్నారు. ఆనంద్ మనసు కీడును శంకించింది. దగ్గరకు వెళ్తానే

"ఏం జరిగిందమ్మా? ఇంత రాత్రి వేళ..."

"నాన్న గారికి ఏక్సిడెంట్ అయింది. హాస్పటల్‌లో వున్నారు" ఆమె ఏడుస్తూ చెప్తోంది. ఆనంద్ మెదడు ఆలోచించడం మానేసింది.

"ఇప్పుడెలా వుంది?" మధు అడిగాడు.

"ఆపరేషన్ చేస్తున్నారు. తొందరగా వెళ్దాం" ఆమె మాట్లాడలేక వెక్కుతోంది. మధు పరుగున పెళ్ళి రూమ్ లాక్ చేసుకొచ్చాడు. ఆనంద్‌కి అంతా అయోమయంగా వుంది.

*　　*　　*

ఆపరేషన్ అయిన తర్వాత డాక్టర్ ఆనంద్‌తో మాట్లాడాలన్నాడు.

"చూడండి, మీ నాన్నగారు బతకడం చాలా కష్టం. మా ప్రయత్నం మేం చేసాం. వెన్నుముకకూ, గుండెకూ బలంగా గాయాలయ్యాయి. స్పృహ రాకపోవచ్చు. వచ్చినా, రెండు మూడు గంటలకు మించి... వి ఆర్ వెరీ సారీ మిస్టర్ ఆనంద్" ఆయన గొంతులో బాధ ధ్వనించింది.

ఆక్సిడెంట్ విషయం ఇన్‌స్పెక్టర్ ఇలా చెప్పాడు.

'బలరామ్, వాళ్ళ సూపరింటెండెంట్ ఇంజనీరు కలసి ఏలూరు నుండి వస్తుంటే, ఒకచోట రోడ్డు బాగా పాడైపోయింది. స్పీడ్‌లో వస్తున్నందువల్ల కంట్రోల్ తప్పి చెట్టుకి డాష్ ఇచ్చింది కారు. సూపరింటెండెంట్ గారి కాలు ఫ్రాక్చరయింది"

బలరామ్ గారు చనిపోయే పావు గంట ముందు ఆనంద్‌తో ఒంటరిగా మాట్లడాలన్నారు.

"ఆనంద్, ఇందాక మేము వస్తూన్న రోడ్డు సంవత్సరం క్రితం మా కొచ్చిన కన్‌సైన్‌మెంటే. నేనే దగ్గరుండి రోడ్డు వేయించాను. సంవత్సరం తిరక్కుండానే గోతులు పడిపోయిందది. నేను తీసుకున్న గోతిలో నేనే పడిపోయాను. నేను చనిపోతున్నందుకు బాధపడడం లేదు. ఇప్పుడు నువ్వు చెప్పినట్లే ఈ ఆస్తిని బయటకు పంపేయి. నా బాధేమిటో తెలుసా? నా చేతుల మీదుగా సంపాదించిన ఆస్తిని నా చేతుల మీదుగానే వదిలించుకోలేకపోయాను. పాపాన్ని మూట కట్టుకున్నాను. నీ కన్నా నా కది నిజంగా ఎక్కువనుకున్నావురా? అహంకారాన్ని చంపుకోలేకపోయాను రా. నీ ముందు తలవర్ంచలేపోయాను. అర్థం చేసుకో" అని చేతులు పట్టుకుని దగ్గరకు తీసుకున్నారు.

"నాన్నా" అప్పుడేడ్చాడు ఆనంద్. హాస్పిటల్ కదిలిపోయింది. తర్వాత ఆయన పోయారు. ●

పటిష్ఠమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్